# ఉత్తపుణ్యాం

ఏమోయ్ - చంటివాళ్ళూ -!

ఆచంటీశ్వరుడి కథ, యీ కారులో ఎంతమందికి తెలుసు? అందులో ఏదో పరమ బూతుందనే అపోహతో, వాళ్ళకు తెలిసినా, మీకు చెప్పి ఉండరు.

అన్నీ ఉడిగిన మానాయనమ్మ, నేనలనాడు బాలపాపణ్ణై మా అమ్మ ఒడిలో చేరి, బాయికోసం, ఓ మానాన వేధించుకు తింటూ పీల్చి పిప్పి చేస్తూంటే - అవిడను కవ్వించి నవ్వించడానికి ఆ కథ చెప్పింది. నేనూ ఊఁ కొట్టాను.

బొడ్డు ఊడనప్పుడు, ఆ కథ విన్న ఫలం - పెద్దెరిగిన తరువాత నాకు బెడిసి కొట్టిందని - నా తల బిరుసు తనాన్ని పట్టి, మా వాళ్ళకు గట్టి నమ్మకం.

అందరిలాగానే పుట్టాను. ఆ కన్నవాళ్ళ తాహతుకొద్దీ అల్లారు ముద్దుగా పెరిగాను. చదువు సంధ్యలు చాలా వరకూ వచ్చినాయి. వాటంతట అవే నూనూగు మీసాలూ వస్తూ వస్తూ ఉన్నాయి. 'ఇక మా తండ్రికి రెక్కలు వస్తున్నాయి!' అని, మా యింటి పట్టు అంతా సంబరపడే తరుణంలో, ఉండి ఉండి నాకు, అదే దుర్బుద్ధో కాని, (ఇది, పెద్దల సమగ్ర అభిప్రాయం) చదువు మానేస్తున్నా నన్నాను.

'మానేసి?' మానాన్న కొట్టొచ్చినంత ఉరిమాడు, ఆ ప్రశ్ననే మా అమ్మ, ముత్యాలలాంటి కన్నీటితో, మరో రసంలో, మరో స్థాయిలో అడిగింది.

'మానేస్తాను - అంతే!'

'ఆ తరువాత ఏం చేస్తావోయ్ - వాజమ్మా!'

'కుండల్లో గుర్రాలు తోలుకుంటూ, వంట యింట్లో నాకు ఎదురు గుండా కూర్చుంటా వట్రా' అని, నాయనమ్మ బాధ్యతాయుత సవాలు!

'నీ ఎదురుగుండా కూర్చున్నా ఫలం పాటే తరించిపోతారు! నాకు తెలుసు, వాడి చూపంతా, మనోహరి కూతురి మీద ఉంది! వీడు ఆ వీధిని తారట్లాడటం అది కిటికీలోనుంచి, తళుక్కుమనడం. ఒరేయ్! నేను ఆవలిస్తే ప్రేగులు అంకెతప్పకుండా లెక్క పెట్టే ఘటాన్ని తెలుసునా? వెర్రి వేషాలు వేశావంటే.'

నాన్న ఏవం విధంగా ఘోషించి, ముష్టి ఝళిపించాడు.

అమ్మ ఆపాళం ఎరిగిన ఇల్లాలు కనుక, చెయి చేసుకుంటాడేమోనని నిజంగా బెదిరిపోయింది. నాకు భయం వేయలా, ఎందుచేతనో నవ్వు వచ్చింది.

నాయనమ్మ, నాన్న మాటకు అడ్డం వచ్చింది.

'చాల్లే నీ ప్రతాపం! పోలికలు ఎక్కడకు పోతాయి! ఏడేడు తరాలనుంచి, అందరి నిర్వాహకమూ ఇదే! వీడి ఈడప్పుడు నీవు ఇలాగే అఘోరించావు కదు! ఇప్పుడు తగుదునమ్మా అంటూ శ్రీరంగనీతులకు బయలు దేరావు! ఏం, అది సానిదీ, వీడు, యీడొచ్చే సరసుడు.'

'అమ్మా! నీకు మతి పోతూంది!' అంటూ, నాన్న, గుక్క తిప్పుకోలేక, 'ఎవరి కర్మం వారిది' అని రుసరుసగా అక్కడ నుంచి, చక్కా పోయినాడు.

'మరీ, పసివాడవుతున్నాడురా మీనాన్న!' అని నన్ను చూసి పకపకా నవ్వింది మామ్మ!

'అదేమిటే అత్తా! నీవూ వాడితో ఏకమైనావ్' అంటూ అమ్మ కల్పించుకుంది! [మా అమ్మ, పరాయిసంబంధం కాదు! నాన్నకు మేనమామ కూతురే సయామూ: చిన్నప్పుడే తల్లికి మొగంవాచిపోతే, మేనత్త పెంచి పెద్దదాన్ని చేసి, తన కొడుక్కిచ్చి చేసుకుంది. ఆ ఆలన కొద్దీ, అమ్మ, ఆవిడ దగ్గర, నాకన్న మిన్నగా మారాం చేస్తుంది.]

"ఒసేవ్ అమ్మా! నేనూ వాడూ ఒకటి కాక, నీతో ఏకమౌతానుటే! నీవు పచ్చి శ్రోత్రియుడి కడుపున పుట్టావు నీకేం తెలుసే, యీ ఆషామాషీలు?"

ఈ పండుతండ్రికి, మా ఆయానపేరు, ఏరీ కోరీ, నేను కావాలని పెట్టించుకున్నాను! వీడూ ఆయనంత వ్రతములు చెయ్యద్దూ? అంటూ, మామ్మ నన్ను అక్కున చేర్చుకుని, అలా, తలనిమురుతూ, పతిధ్యానంలో పడిపోయింది. అమ్మ, మా యిద్దరి యోగముద్ర చూసి, ఫక్కున నవ్వింది. నేను, మామ్మ కౌగిలి దూసుకుని పారిపోయినాను. [తాతయ్య అంటే నా పేరిటి ఘనుడు, నాన్నను కన్న గేసు, శతాధిక గ్రంథసాంగుడని, నాన్న కూడా గర్వపడే హంశమే: ఆయన, అనేక ఆస్థానాల్లో తంబుర మీటి, గొంతెత్తి కనకాభిషేకాలు చేయించుకున్నాడు. ఆడేపాడే నాయకసానులు ఎందరో, సంజెదీపం వేళ, చేయెత్తి ఆయనను తలచుకుని మొక్కుతారు. నాన్నను 'అన్నయ్యా!' అని పిలిచేందుకు వావి వరసైన రాధా సుందరులు ఎన్నో రాజధానులు ఈ నాటికే ఏలుతున్నారు. అదిగో ఆయన పేరే, నాకు పెట్టింది.]

నాన్నకు తాతయ్య ఆర్జించిన సిరి అబ్బింది కాని, ఆ శృంగారం, ఆ ధోరణిలో అలముకోలేదు. మామ్మ విసురులను బట్టి, ఏదో కసుగాయతనంలో, ఒకటి రెండు చిందులు వేశాడేమోనని, ఊహించడమేకాని, నాకు బుద్ధి తెలిసినప్పటినుంచీ నాన్న, వత్తి పడకటింటి కుందేలు! ఆ అమాయకపు యిల్లాలితో – మా అమ్మలో అంత రాసిక్యం ఉందని, అది నా చదువుకూ బుద్ధికీ అందని విషయం! అయినా తల్లిదండ్రుల మధుర భావాన్ని భక్తి ప్రపత్తులతోనైనా అట్టే తరచరాదని పెద్దల వాక్యం. గనుక, అమ్మకూ నాన్నకూ ఒక దణ్ణం పెట్టి, వాళ్ళను ఇంతటితో వదిలి పెడతాను. ఇంతకూ, మన కులస్థాన ప్రతిష్ఠలతో కథకు ఎత్తుకు ఎత్తు సంబంధం ఉంది. కనుక, వంశవృక్షాన్ని ఒక్కసారి ఝళిపించ వలసిన అగత్యం కలిగింది:

ఇక, నా మొర వింటారా:

మా వీధికి, రెండు వీధులు అవతల మనోహరి మూడంతస్తుల మేడ అంతకంత సంపద ఆవాహినీ అంతా, వాళ్ళ ముత్తవ తల్లి నాటి నుంచి వస్తూంది, అక్షయంగా.

ఆ అవ్వ పేరు మనోహరేనట! మాంచి పకడైన నిండు యవ్వనంలో, వెన్నెల పిండల్లే ఆ చిన్నది అప్పటికి ఉన్నతగుపాటి ఉద్యానవనంలో విహరించుతూంటే ఏ ప్రాంతపు రాజకుమారుడో, వేటకు వెళుతూనో, తిరిగి వస్తూనో, ఆ చక్కని చుక్కను చూసి, మక్కువ పడి ఎన్నో రాయబారాలు నడిపి, ఎంత విరహబాధో

అనుభవించి, చివరకు మన్మథుడు అనుగ్రహించగా, ఒక్క రాత్రి ముక్కువకే, తన ధనాగార మంతా కొల్లబోశాడని, సాధనిక కైఫీయత్‌లో ఉంది. ఆవిడకు అంకితంగా ఆస్థానవాగ్గేయకారులు రచించిన పదములు. ఆనాడు దేశాన్నంతా రసావేశంలో తేలించినవి. ఆవిడ మనుమరాలే, ఈ మనోహరి. ఈవిడ కూతురే కమలవాణి, నాకూ కథకు కావలసినది.

మనోహరి ఎవరికంటా పడదు – నేను అంతవరకూ, ఎన్నడూ ఎలా ఉంటుందో ఎరుగను. ఆవిడకు, తాతయ్య అంటే, అమిత గౌరవమనీ, అందుచేత మర్యాదకోసం, ఎన్నడన్నా ఏ పూవులో పండ్లో, వాళ్ళతోటలోవి, మా యింటికి పంపడం, మా వాళ్ళు వాటిని అప్యాయంగా అందుకోవడం, మామ్మ ఆ పట్టుకు వచ్చిన మనిషి ద్వారా, వాళ్ళ యోగక్షేమం విచారించడం ఇది, మా ఇంట మామూలే.

అయితే అంతవరకే ఆ మరియాదలు ఆ యింటికీ ఈ యింటికీ రాకపోకలంటూ లేవు. ఏమో ఎన్నడన్నా, మామ్మ తీరిక చేసుకుని ఓసారి తొంగి చూసి వచ్చేదేమో నాకు తెలియదు.

మనోహరికి ఓ కూతురుందనీ మాటల సందర్భంలో తెలిసినా, నేను అంతగా పట్టించుకోలేదు. క్రమంగా, ఆ చిన్నదాని పేరూ తెలివి తేటలూ, అయీడుకే రతినీ భారతినీ ఎలా మించిపోయిందో, అవైనాలూ, వాటంతట అవే నాచెవిని పడటం మొదలు పెట్టినాయ్. [రుక్మిణీ కల్యాణంలో సీసపద్య ఒరవడిలో ఇక్కడ నామనసూ, అక్కడ అలదాని వయసూ డీ – అంటే డీ, గా మలుచుకు వస్తున్నాయ్]

ఇందుకు కొంత అస్కారం ఉంది.

నేను సాధారణంగా చదువు మిషతో కాలం గడిపే, గది పక్క వసారాలోనే, మామ్మ తీరుబడిగా ఉన్నప్పుడల్లా, నడుం వాలుస్తూ ఉంటుంది. మనోహరి యింట్లోంచి, ఎన్నడన్నా ఏ పండో ఫలమో, వాళ్ళ బోనకత్తె తీసుకు వస్తే అదీ, ఈవిడా, అక్కడే రాచకార్యం మొదలు పెడతారు. వాళ్ళు మాట్లాడు కునేదంతా, వద్దన్నా నాకు వినబడుతోంది. అలా వినగా వినగా పుస్తకం పేజీ తిరగ వేసినప్పుడల్లా, అక్షరాలన్నీ పులిమేసి, ఏదో అవ్యక్త సుందరాకృతి మిలమిలలాడేది. ఒడలు తెలియని పరాకైపోయి మనస్సు మౌనంగా, 'కమలా!' అని గట్టిగా పిలిచేది. ఆ చిన్నదానికి వినపడిందేమోనని, తెలివీ బిడియం తెచ్చుకొని, అదిరిపడేవాడిని, నన్ను నేను సంభాళించుకుంటూ, నవ్వుకునే వాడిని. నేనంటూ ఒకడిని ఉన్నానని, కంటచూడకుండానే, తన కోసం కలవరిస్తూన్నానని ఆ అమ్మాయికి ఏం తెలుసు? నిజానికి!

కాని, నేను అలా అనుకోవడం పొరబాటు. ఆ యింట ఒకరవ్వ ఉందని తెలిసినట్లే, ఈ యింట ఓ అర్భకుడున్నాడని, మాటల ధోరణిలో పొక్కి ఉండదూ? పైగా, ఆ పండూ ఫలం జేరవేసే, ముసలిది, ఆ యింటికి పాతకాపు, మనోహరి పడుచుతనం అంతా, అదే తీర్చి దిద్దిందట. మామ్మకు, ముసిలి, కేవలం పాదభక్తురాలు. వాళ్ళిద్దరూ అరమరికలు లేకుండా, పొద్దుపాటు ఎరగకుండా, కబుర్లు చెప్పుకునే వారు; యీ ముక్కల్లో, కొన్ని కాకపోతే కొన్నైనా, అక్కడ మళ్ళీ ఏకరవు పెట్టకుండా ఉంటుందా, అది!

నేనంటూ ఉన్నానని, వాళ్ళకు తెలుసునన్నమాట! అమ్మయ్య! కాని, కమలకు తెలుసునా, అసలు విని ఉంటుందా, విన్నా, పట్టించుకుంటుందా? ఆ అమ్మాయి మనసేమిటి? ఏమో!

నేను విష్ణుచిత్తుణ్ణికాను. వాదన తాపానికీ, చలిజ్వరానికి తేడా తెలియని, అమాయకుణ్ణికాను.

అంతమాత్రాన అంతోయింతో ఘటికుణ్ణి మాత్రం కాను. ఫలానిది – ఫలానా అని, కొంత చదువూ, కొంతవినికిడి ఓ మూలాన తెలిసినవాణ్ణేకాని, ఏజాడా, ఆ తెలివిలో, యింత వరకూ మెలిగిన వాణ్ణికాను. రమారమి ఘట్టిగా ఎందుకూ కొరగాని వయసు అని అనుకుని మారాలి. సంభాళించుకో కలిగిన పసితనమూ కాదు.

వయసుకేం వచ్చె – కథనడవడానికి, దాని అడ్డంకి ఏంలేదు. మళ్ళీ, మామిడి పళ్ళకేసి మళ్ళుదాం.

పండు జాతి చెప్పిన మీదట, అది ఎండలు ఝుమాయించే, పక్కకాలమని మనవి చేయనక్కరలేదు కదా! బయట అంతా భగ్ మంటూన్నప్పుడు నిద్రరాదు, మేలుకుండ బుద్ధిపుట్టదు. అయినా మొండికేసి పడుకున్నాను. అరచేతిమందం జాతి తువ్వాలు తడిపి, మడతకు మరో మడతవేసి గుండెకు హత్తుకుని, మ్రాగన్ను వేస్తే, అలా కౌగిలిలో ఉన్నది, తడిగుడ్డ కాదు, మరేదో, మరేదో అని మనసులో తీయగా రాపాడగా, ఓ పట్టుకు అదమరచేందుకు కొంత అవకాశం ఉంది.

ఆ తరుణంలో, అలాగే తంటాలు పడుతున్నాను – క్రమంగా ఒళ్ళు సొమ్మసిల్లుతూన్నది.

ఇంతలో, యీ చెంప వసారాలో నుంచి, మామ్మ మాటలు వినపడ్డాయి.

'అదేమిటే, అన్నీ ఒక్కచెట్టున పండినవే కదా – ఇందులో మళ్ళీ యీ వచ్చుందాలేమిటి. వారికి ఇదీ, వీరికి ఇదీ, అంటూ ఇది, నీ తీర్పా ఏమిటే, లక్ష్మాయ్!' మామ్మగొంతు రవ్వంత నవ్వినట్టు, నాకు అనిపించింది.

లక్ష్మాయ్, నాకు హాయిగా వినపడేట్టుగా నవ్వుతూ, 'ఈకాలం వారికి, ఎవరూ నేర్పక్కర్లేదమ్మోవ్! ఎన్ని వెనకాల పుట్టినా, ఇంకా కళ్ళు తెరిపిన పడకముందే, మనకన్న ఏడాకులు ఎక్కువ చదువుతారు! అమ్మ నిన్నటేలనగా, మాటనరసకు అంది ఏమేవ్, బావి దగ్గిర చెట్టుకాయలు, పలకమారినవి చూసి, పట్టుకెళ్ళియిచ్చి రమ్మను పొద్దున్నే, చేతులు తెలిపిలేక, యిప్పుడు తెమిలాను. పచ్చ పూసినవి, యీ రాత్రికే అక్కరకు వస్తాయి, మిగిలినవి మాగేస్తే అయ్యా, కోడలూ రేపూ మాపూ తలో ముక్కా తినచ్చు.'

వింటూంటే, నాకు విసుగెత్తుకొచ్చింది. తెచ్చింది. అక్కడ పడేసి చక్కా బోక, చెవి క్రింద చేరి ఏమిటా నస: అసలు నా దుగ్ధ అది కాదు. మామిడి కాయలు, పండితే ఏం, ఎండితే ఏం, ఎవరు ఏ పూట ఇక ఎన్ని ముక్కలు తింటేదానికేం, నాకు కావాలసిన కబురు, దాని నోటి వెంట పెగలదేం?

కాని, ఆ కాబోయే బోసి నోటికి అక్షరాలా వెయ్యేళ్ళ ఆయుస్సు, విన్నతరువాత, నా స్థితి ఎలా ఉందని? నా మనసు ఏమై పోయిందని?

'ఈ పండు ఒక్కటే మటుకు మీకెవరికీ కాదమ్మోవ్! మా బంగారు నాయనకు' దాని ధోరణిలో, మరోరకం నవ్వు తెర ఉంది.

'ఏమో?' శకుంతల లేడి పిల్ల లేత కాలికి, కణ్వుడు ఏ దేవలోకంలోంచో

తెచ్చిన మువ్వలు కట్టి కదిలితే అది చెంగ్ మన్నప్పుడు, మామ్మ, 'ఏమో!' అనడం, నాకు అలా అనిపించింది.

అప్పుడు అర్థం చేసుకునే ఈడేదీ? ఇప్పుడు తలచుకుంటే ఆ ఏమోలో మామ్మ అరవై ఏళ్ళ జాణతనమూ, ఎంత సుతారంగా, ఛళ్ మన్నది.

లక్ష్మాయి, పగలబడినంత ధోరణిలో ఎత్తుకుని, ఒక్క రెబ్బనవ్వింది. ఆ నవ్వు అలా చిదిమేసి, 'ఏమో' అ తల్లిమనసులో ఏముందో? కాయలన్నీ బుట్టల్లో అమర్చి, తల్లి అలా వచ్చింది. 'వచ్చి జడవేస్తాలే తల్లీ' అన్నాను. 'ఎక్కడికి వెళ్ళొచ్చి' అంది 'మనింటిదాకానే' అన్నాను.

'ఊహూ' అని, పండు పండూ పట్టి చూసింది. ఈ పండు, మరింత సేపు నాజెంచేసింది. నచ్చింది కదా అని అది ఉండనిచ్చుకోమన్నాను. 'నాకెందుకే! అని, నవ్వింది.' ఎప్పుడూ, నవ్వుతూనే ఉంటుంది. ఆ నవ్వుకు అర్థమేమిటి? మామ్మా, లక్ష్మాయీ, కలిసి నవ్వుకున్నారు. దాని దోవను అది వెళ్ళిపోయింది. నాతపన ఉద్ధోలమైంది!

మన్మథుడూ వాడి యింటెల్లి పాదీ, రజాకార్ల భంగిమంలో నా మీదికి ఒక్కుమ్మడి ఉరికారనిపించింది. మనసుతో ఎగిరి మామ్మ కాళ్ళ ముందు పడ్డాను.

మామ్మ నన్ను చూసే – చూడనట్టు ఊరుకుంది. అరచేతిలో, మామిడి పండు, పసిపిల్లను పొదువుకున్నట్టు ఉంచుకుంది. 'నాకేనా మామ్మా!' అంటూ వేయిచేతులు జాచాను. ఆవిడ నా ఆదుర్దాయావత్తూ, ఓమారు తలవిసిరి విదిల్చేసింది. ఓరగా, ఒక్క చూపుచూసి, 'ఏం, నీ కేనని రాసి పెట్టి ఉందా?' – అని, ఏదో చాలులో అంది. 'ఎవరికి దక్కనున్నదో!' అని తనలో తాను అనుకున్నట్టు నన్ను చూసి అనేసింది.

'ఆకలేస్తుంది మామ్మా!' అంటూ ముద్దులు కుడవసాగించాను. ఎలాగో అలా చెల్లించి, ఒడేసి లాక్కుందామని, శాయశక్తులా, బ్రహ్మాండంగా ముఖాభినయం చేశాను, కాని, ఆవిడ వీసపాలైనా మొగ్గలేదు. పరధ్యానంగా, నన్ను కాదన్నట్టుగా –

'ఆకలవుతుంటే, ఇక్కడే దేవుళ్ళాట ఎందుకూ? అవిగో అక్కడ బుట్టకెత్తూ ఉన్నాయి. పోయి అఘోరించరాదూ? అని గిరుక్కున మళ్ళింది. ఇంతలో ఛెళ్ళున ఇటు తిరిగి – '

'పవలు నిద్రపోతే ఆకలి మందగించాలిరా పిచ్చి తండ్రీ!'

'నేను నిద్రపోందే!' అనేసి నాలుక కరచుకున్నాను.

'నాకు ఆమాత్రం తెలియదూ?' మామ్మ ఆముక్క నిజానికి ఎంత కోపంగా అందని! అది, అంతకంతా నవ్వని నాకు తెలుసును. కాని, ఆవిడను కవ్వించే త్రాణలేక, అతకన్న ఎక్కువ ఆవేశం తెచ్చి పెట్టుకుని, వేటకు వెళ్ళే రాజుకొడుకు నడచినంత ధూకుడుగా ఈ గదిలోంచి వసారాలోకి, వసారాలోంచి, సావడిలోకి, పక్కగదిలోనుంచి, దాని పక్కగదిలోకి, అక్కడ వసారా మెట్లు దిగి, చంద్రకాంత మండలమీద పుటుకు – పుటుకు అడుగులు వేసుకుంటూ మళ్ళీ ఎప్పటి చోటుకే చేరుకున్నాను.

మామ్మరాచకార్యం చేసే వసారా అంచునే, మా మంచి నీళ్ళబావి ఉంది. ఇందాకటి నుంచీ ముచ్చెమటలు పోసి ఉన్నాయేమో – ఆ చిరాకూ, అసలు చిరాకూ నూతెడు నీళ్ళూ పోసుకున్నాను. ఈ పంచకాదని, ఆ పంచ, ఈ

జుబ్బా బాగుందికాదని అషర్టూ వెనుకటికి, చీరె సింగారించేటప్పటికి పట్నం కొల్లబోయిందన్న సామెతగా పక్కా ఝామును ముస్తాబై తెమిలాను.

ఆ పూట కన్నా, ఎలాగైనా మామ్మ కంట పడకుండా ఉందామని నా ఎత్తు. కాస్త పొద్దు పోయేదాకా, ఏ చెట్టునో పట్టి తిరిగి తిరిగి, యిల్లు చేరుకుంటే, ఆ వేళకు, నా కోసం అత దాక కనిపెట్టుకుని కూర్చుని, విసుగెత్తి, నన్ను నాలుగు కసిరి, నన్ను కన్నందుకు నాన్ననూ అమ్మనూ చెరోనాలుగూ కసిరి, నడుం వాల్చి, మళ్ళీ లేవచ్చును కదా అని ఒక్క కునుకు కునుకుతోంది. ఆ జాడ కనిపెట్టి గుట్టుచప్పుడు కాకుండా సర్దుకుంటే, తెల్లవారిన తరువాత, చూసుకోవచ్చు.

నేను, ఇంత పథకం వేసానే కాని, మామ్మ దాన్నంతా, అమాంతం చిటికెవేశేసింది.

గుమ్మంలో అడ్డంగా గుర్రం ఎక్కిన రౌతల్లే నిలుచుండి 'ఎక్కడి కోయ్!' అంది మొగరాయుడు అన్నట్టు.

'ఏం ఆకలి ఏమైంది?'

తల, ఓపికున్నంత మేరకు వంచుకున్నాను. మామ్మ, నా రెక్క పట్టుకుని, నడిపించుకు పోతూంది. వచ్చిన త్రోవనే.

'ఒరేవ్! వెనుకటికి ఇలాగే, వడసారం ఏ భై ఏళ్ళనాడు, ఓ పిల్లాడు, ఇల్లాగే బయలుదేరాడు – కళ్ళకు కాటుకెట్టుకుని, కాళ్ళకు పాంకోళ్ళూ, చేతగొడుగూ, చంకను మూటా మా పోషు మీద ఉన్నాడులే – ఆ పాళాన వాళ్ళ మేనమామ అడ్డుపడి, పోయే వాణ్ణి పోనీకుండా, 'అబ్బే', ఆ ఒంటి జంఝప్పోచతో, ఒక్కడవూ, కాశీకి వెళ్ళి, నీవు ఒరగపెట్టే దేమిటోయ్ – మా పిల్లదాన్ని కూడా ఉచ్చుపోసుకు వెళ్ళు, అని మెడలు విరిచి అంటగట్టాడు పాపం, అతే, ఆ మారాజు, ఆ గడియనుంచీ, కాశీ కాదు కదా, గుమ్మం దాటి కాలు ఈవల పెట్టలేదు.'

మామ్మా నేను ఇద్దరం కలిసి నవ్వాం కుర్చీలో కూలబడి, నేను యింకా హాయిగా నవ్వుతూనే ఉన్నాను.

'తిను!'

ఎదురు గుండా బల్లమీద పళ్ళెంలో, కమలాఫలాలు ఒలిచినట్టు మామిడి ముక్కలు, సుతారంగా అమర్చి ఉన్నాయ్. ఒక్కసారి, ఆ ముక్కల వంకా, మామ్మ మొగం వంకా చూశాను. 'ఒరేయ్ నా మొగం చూస్తే నీకేం కడుపు నిండుతుందిరా, తిను!'

ముక్కల కేసి చూపుతిప్పుకున్నాను. అందుకుందామని చెయిజాపి, జాపిన చెయి అలాగే ఉలిక్కి పడ్డది. మామ్మ, ఆ పండు, ముక్కలు చేసిందా?

'ఆ పండేనా?' పుట్టెడు దుఃఖంతో, ఉసూరుమంటూ అడిగాను.

మామ్మ, పింజెలు పోసిన ధోవతి ఝాడించినట్టు, మాటలు దులిపేసింది.

'ఏ పండో ఆనవాలుందా?'

'ఏ పండుకు ఏ రుచో తెలుసుకునేంత దిప్పకాయ వైనావా?'

'ఎదురు గుండా ఉన్నవి తిను, లేని వాటికి తరువాత తీరుబడిగా అంగలార్చవచ్చు!'

'ఈ వయస్సుకే, ఊహలైతే ఉన్నాయి కాని, పారచూసేనేర్పేదీ, పండుకావాలిట పండు – ఏం చేసుకుంటావోయ్ నాగన్నా! ఎవరు అందిస్తారు?'

ఏమాటా నేను అర్థం చేసుకోతలచుకోలేదు. మామ్మ ఎన్ని మాటలన్నా తల ఎత్తేందుకు సాహసించలేదు. ఓపిక ఉన్నన్ని మాటలూ అనేసి కత్తి ఒరదూసుకున్నప్పుడు రాపిడి అయినట్టు, ఝుంయ్‌న గొంతు సవరించుకుని నా విచారానికి నన్ను వదిలేసింది, మామ్మ.

అవతల గదిలో ఎక్కడో, అమ్మను పిలుస్తున్నట్టు మామ్మ గొంతు, దూరదూరాన ఉరిమేదాకా, నేను తేరుకో లేదు. ఎదురుగుండా ఉన్న పళ్ళముక్కల వంక చూడలేక చూడలేక చూసి, మౌనంగానే బావురు మన్నాను. ఆ పళ్ళాన్ని కౌగలించుకుని పరిదేవనం చేయడానికి, నాకు నేనే పట్టుతప్పి, చేతులు జాపి, అలా ముందుకు వ్రాలిపోయినాను.

కౌగిలిలో, అది ఇముడలేదు కాని, చేతి విసురుకు పళ్ళెం బెడిసి, పక్కకు జరిగి పోయి, ఘంగ్ మన్నది. మందంగా, పండురసం తొణికి, రెండు మూడు చుక్కలు, బరువుగా ముంజేతి మీద చిందాయి.

పళ్ళెం బల్లమీద లేదు. గిన్నె మీద ఉంది. గిన్నెలో, పండు, పండుగా ఉంది.

పండు చూడగానే, ఇందాకటి యాతనంతా, ఓ చెంపకు నెట్టేశాను. పంచప్రాణాలూ పోతూ పోతూ, అంతలో అది కంటపడగానే, గిరుక్కున మళ్ళాయ్. 'అమ్మయ్యా' అని, నిదానంగా తెప్పరిల్లడమే మరచిపోయినాను. వేయింతలి సత్తువతో, ఎన్ని నిలువులో, మనసులో ఎగిరి గంతువేశాను. ఆదమరచి, అది అందుకుని, పరిపరి విధాల నాట్యం చేశానో ఏమో, ఏమీనాకు గుర్తులేదు – మైకం అంత ఆవేశంలో.

వెయ్యేళ్ళు తపస్సు చేసి, పుట్టలు పట్టిపోయి చివరకు బ్రహ్మకు కూడ విసుగెత్తగా ప్రత్యక్షమై యిచ్చిన వరాన్ని, దోసిలిలో పొదువుకున్న జటాజూటుడికి మల్లే, ఏమాత్రమూ ఓపికలేని చేతుల్లో ఏనుగంత సత్తువతో, జాజి మొగ్గను పట్టుకున్నట్టు మునివేళ్ళతో ఆ పండును, అలా ఎంతో సుతారంగా పుణికి పట్టుకుని, పక్కమీద వెల్లకిలా పడుకునే, కళ్ళు తెరుచుకునే, ఏమీ చూడకుండా, ఏమీ ఆలోచన లేకుండా ఎంతసేపో, ఉన్నాను.

కొంతసేపటికి, పండు మెలిసింది. రవంత వయ్యారంగా, కులికింది సిగ్గు పడినట్టు, చెంపంత మేర చిరుగా కెంపెక్కింది తగిలినంత మేరా, మునివేళ్ళు, ఆ తియ్యదానికి ఝల్ మన్నాయి. అపచారం చేసినట్టు మనసుతోనే కళ్ళకు అద్దుకుని, ఎదురు రొమ్ము మీద ఉంచుకున్నాను. అలవోకగా, చేయిదాని మీదికి సాగినప్పుడల్లా, ఆ నున్నదనం. అతిమెత్తని వ్రేళ్ళతో, పుణుకుతున్నట్టు అనిపించి, చేతికి చేయి తగలనీయడానికి, సిగ్గుపడి ఎంతో ఇదయ్యేవాణ్ణి.

అలా, తలచుకుంటూ, తాకేందుకు బిడియపడుతూ, ఎన్ని కాలాలైనా శాశ్వతంగానైనా ఉండి పోగలను కాని, యింట్లో వాళ్ళు ఎవరైనా చూస్తే? నేనిలా మామ్మ కంటపడితే? ఇక, తలెత్తడం నాతరం కాదు.

అనుకున్నంత వడిలో, క్రిందకు గంతేసి, అలుమారలో, అరంతా ఖాళీచేసి, నాసిల్కు ఉత్తరీయాన్నీ, పొత్తిళ్ళుగా అమర్చి ఆమెత్తదనాన్ని మీద, నా మనసును దాచేసుకున్నాను. లోకాలన్నీ జయించినటీవిలో, వీధుల్లోకి వచ్చేశాను...

(చేతిరాత)

★ ★ ★